తండ్రి వెంకటరామయ్య వ్యాపారమున ముని
గియుండెను. లోన పెద్దగదులలో నైదారు
బీరువాలలో ఖద్దరువస్త్రము లున్నవి. వసా
రాలో వందలకొలదిసంచులలో తీసినప్రత్తి
సిద్ధముగ నుండెను. భృంగరవమును మించిన
రవమున దేశమాతృసందేశము నుద్బోధిం
చుచు పెక్కురు స్త్రీలు వేఱొకగదిలో
రాట్నములతో నూలు వడకుచుండిరి. వెంకట
రామయ్య యొకసారి లోనికివెళ్లి నూలు పరిశీ
లించుచు, వారితో వాదించుచు, నూలు సరిగ లే
నందులకు వారిజీతములు తగ్గింతునని బెదరించు
చుండెను. ఒకసారి హాలులోనికివచ్చి, నేతకు
నూలుకొనిపోవువారితో వాదించుచు, వారు నేసి
తెచ్చిన బట్టలు కొలుచుకొనుచు, మూరతక్కు
వయినదనియు, అంచు బాగుగ లేదనియు, నేత
పలచబడినదనియు కేకలు వేయుచుండెను.
పొందూరుఖద్దరుకొన్న యొకతగ్గుమనిషి యది
మంచిఖద్దరు కాదనునభిప్రాయముతో తిరిగివచ్చి
దొంగఖద్దరమ్ముచున్నటుల వేమూరినారాయ
ణమూర్తిగారికి తెలిపి డొక్కబ్రద్దలుచేయిం
చెద నని వెంకటరామయ్యను బెదరించు
చుండెను.

ఆహాలులోనే యొక బల్లవద్ద నాసీనుడై
సుధాకరుడు చిట్టాలు వ్రాయుచుండెను. అక్క
డిజనసమూహమును చీల్చుకొని యాతుర
తతో లోన ప్రవేశించి వెంకటరామయ్య
యెదుట నిలిచిన రోహిణి యాతని నాకర్షిం
చెను. రోహిణి సుధాకరుని యేర్పాటు నను
సరించి కడచిన యాఱుమాసములనుండియు
ఖద్దరమ్మకమువలననే రాజమహేంద్రవరమున
జీవించుచుండెను. ఆమె ప్రతిదినమును గొన్ని
చీరలును, రవికలతానులును వెంకటరామయ్య
వద్ద తీసుకొని గొప్పవారియిండ్లకు దిరిగి స్త్రీ
లోకమున బ్రచారముచేసి, యావస్త్రముల
విక్రయించి, శేషించినవస్త్రముల వెంకటరా
మయ్య కప్పగించుచు, రూపాయికర్ధణాచొ
ప్పున నాత డిచ్చిన రుసుముతో జీవయాత్ర
సాగించుచు చెల్లెలిని పోషించుచుండెను. నా
డామె వస్త్రముల దీసికొనుటకు వచ్చియుండ
లేదు. ఆమెచెల్లెలు నాలుగుదినములనుండి
శ్లేష్మసంబంధమగు విషజ్వరముతో బాధపడు
చుండెను. నాడారోగస్థితి భయంకరముగ
నుండెను. అమ్మలక్కలసలహాలవలన బ్రయో
జనము లేకుండెను. సమీపగ్రామముననున్న
మాలవాని సోదెయు, మంత్రశాస్త్రిగారి
విభూతియు, పూజారిగవరయ్య భూతవైద్యము,
కంసాలిశరభయ్య చేతినాడెము, నామాల నర
సింహాచార్ల నానారోగనివారిణియు నక్కఱ
కురాలేదు. తుదకామె వైద్యరత్న బిరుదాం
కితులగు సుప్రసిద్ధాయుర్వేదవైద్యుల పాద
ముల బట్టుకొనగా నాతడామెకు ధైర్యము
గొల్పి వైద్యసహాయ మొసగుచుండెను. పథ్య
మునకు వలయుధన మామెవద్ద లేకుండుటచే
నాలుగైదురూపాయలైన సర్దుబాటు చేసిన
ముందు వారమున తాను విక్రయించువస్త్ర
ముల రుసుములో తీర్చుకొనవచ్చునని వినయ
పూర్వకముగ ప్రాధేయపడి యామె వెంకట
రామయ్యను ప్రార్థించెను.

వెంకటరామయ్య కఠినహృదయుడు;
లోభి. ఆమెప్రార్థన లాతనిమనస్సును కరగింప

